# హితబోధ

రచయిత: ఆయపిళ్ళ రామారావు

[స్త్రీ పురుషులు ఒకవిధమైన ప్రేమమాత్రం విఫలమైనంతమాత్రాన తీరనితాపాన్ని అనుభవిస్తూ తమతమ కర్తవ్యాల్ని ప్రస్తుతపరిస్థితుల్లో మరుస్తున్నారన్న విచారం నాకు కలగటంచాత ఈసారి కలాన్ని ఈవిధంగా త్రిప్పాను. దీన్ని హృదయపూర్వకంగా వారికంకితం చేస్తున్నా. ఇదివరకు అనుభవాన్ని తెలియజేసిన మీకు, ఈ అనుభవాన్ని కూడా తెలియజేయడం నావిధి. ఇకముందు అనుభవాల్ని గురించి తిరిగికలుద్దాం.]

“.....................విరహతాపా పరితప్త హృదయంతో ధైర్యంచేసి వ్రాసిన నీలేఖనందుకున్నాను. భ్రాంతిని నవ్యసుమాల్తో పూజించటానికి ప్రయత్నాలు చేస్తోన్న నీలేఖిని తప్పుత్రోవల్లో యికనైనా నడవకుండా చేయాల్సిన అవసరం నాకు కలిగింది గనక యీజాబు నీకు వ్రాయటానికి సాహసించాను. నీ ఉత్తరాన్ని అవలోకించిన మరుక్షణంలో కలిగిన సాధారణ మానవ సహజమైన ఆవేశాన్ని ఆవిధంగానే అణచుకోటానికి నిశ్చయించాను. మిట్టపల్లాల్లో వాయువునోవేగాల్తో కల్పుకుంటే గుండెను ఏరు చేసే కాలచక్రం విలువను తెలుసుకోని మాతను ప్రసన్నురాల్నిగా చేసికోగలిగే శక్తినీ, ఉత్సాహాన్నీ నీలో ఉత్తేజింపజేస్తుందనే నమ్మకంతో యీజాబును ప్రయోగిస్తున్నా. నీఉత్తరాన్ని చూచిన నాభర్తకూడ నీ మనస్సంచలాన్ని లక్ష్యంచేసిక చిరునగవుతో “ఇల్లాంటి మృదు శైలితో ఉద్దేశాల్ని వ్యక్తపరుపగలిగే నవయువకుని శక్తిని మాతృదేవి శృంఖలాల్ని తృంచేయత్నంలోకి త్రిప్పగలిగే జాబు నీ హితునకు వ్రాయాల్సిందే” అని నన్ను ప్రోత్సాహపరచటం నాకలంలోని తేడిని మరింత ధారాళంగా ప్రవహింపజేసింది. “న్యాయాన్యాయాల్ని తల్లక్రిందులు చేసి ఒప్పించగలిగిన సామర్థ్యంవున్న మీరే ఆ పని చేయరాదా” అని హాస్యధోరణిలో వారిని కోరాను. కాని మహాత్ముని దీక్షకు ఫలితంగా దేశంలో కలిగిన అలజడిలో తాముకూడ ఎప్పటల్లే కొంత దిగులుగా వుండటంచేత “ఆతని ఆవేశపూరిత హృదయాన్ని త్రిప్పటానికి నామనసిప్పుడు ప్రశాంతంగాలేదు. సహజమైన మృదుత్వంతో నీవే వ్రా” యని తొందర చేశారునన్ను.

అయితే.....నా ఉపోద్ఘాతంలోనే నువ్వు బుద్ధిమంతుడవు గనుక సర్వం గ్రహించేవని తలుస్తాను. నాథం...నీవు యింకా బ్రహ్మచర్యంలోనే వున్నందుకు గర్విస్తూన్నట్లు వ్రాశావు. బ్రహ్మచర్యం నిలబెట్టుకోగల శక్తి నీలో ఎంతవరకూవుందో నీవు నాకు వ్రాసిన ఉత్తరాన్నిబట్టే గ్రహించాను. నేనందరాని పండునని యికనైనా తెలుసుకుని దేశకల్యాణానికి తోడ్పడబోయ్యే సహధర్మిణిని గ్రహించి ముడిపెట్టుకోమని నిన్ను కోరుతున్నా.....నిజమే! చిన్నతనపు ప్రేమానురాగాల్తో అన్యోన్యంగా మనము చనువుగా, నీవు నన్ను “విమలా” అని పిలవటం నిన్ను నేను “బావా” అని పిలవటం నీవూ నేనూ అనేక విధాలుగా ఆడుకోవటం నాకు బాగా జ్ఞప్తిలో వున్నాయి. కాని ఆప్రేమానురాగాలకీ యిప్పుడు నీ హృదయాన్ని పీడించుకు తింటోన్న ప్రేమకూ సహస్రాంతం వ్యత్యాసంవుంది. అప్పటివావివరుసలు మన పెద్దలు వరసకు కల్పించుకున్న సంబంధాల్ని అనుసరించి మనకు నేర్పబడ్డవి. పైగా లోకజ్ఞానం మనకు కలుగని చిన్న తనములోనివి. ఇప్పుడో! నేను, నిరంతరం మాతృదేవి ఋణవిముక్తికి తాము హామీగా వుండటానికికూడా ఉత్సాహపూరితులై తీవ్ర ప్రహారాలకి లక్ష్యం చేయకుండా శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళుతో వస్తోన్న అసలైన న్యాయవాదికి నేను సహచరిస్తున్నా. నా అదృష్టంవల్ల నాకటువంటివారి సేవచెయ్యటం లభించిందని గర్విస్తూంటాను. పొట్టచీరినా అక్షరజ్ఞానంలేని అవస్థలో వారి ప్రక్కను చేరిన మరుక్షణం నుంచీ నన్ను, ప్రపంచాన్ని తెలు

సుకోవటమే కాకుండా నిర్భయంగా వేదికలపైకెక్కి ఉద్దేశాల్ని లోకానికందజేసే ఉత్సాహమునూ, విద్యాబుద్ధులనూ నాకు గఱపి అనేక విషయాల్లో తమకు సహాయకారిణిగా చేసుకున్నారు. ఎల్లప్పుడూ ఆతనికిమల్లే నేనూ ఒక ఆదర్శపాత్రంగా వుండటానికి ఆలోచిస్తోంటాను. నీకూ మాకూ మధ్య చాలదూరం వుండుటచేత బహుశా మా సంగతి తెలుసుకోలేక పోయ్యావని తలుస్తాను. నేను పుట్టినింటనుండిన కొద్ది రోజుల్లోనూ నిన్ను మూడేసార్లు తలయెత్తి చూచానని వ్రాశావు. అందులకు కారణం కామరహితమైన ప్రేమతో చూస్తూండే నీకళ్ళల్లో అదోవిధమైన వికారం నాకు గోచరించటమే. సహజమైన నాభీరుత్వమే నిన్నలా చూడటం మానెయ్యమని చెప్పటానికి అసమర్థురాల్ని చేసింది. ఆ అమాయికపు చూపులు నీలో యింకావున్నట్లయితే నీకు యెంతోహాయిని కలిగించి వుండును. నాభర్తకూడ అందుకు తోడ్పడి వుండేవారు.

అసలు నీవు యేదోపనిమీద మైసుకు వచ్చి నావంక తదేకదృష్టితో కనిపెట్టుకొని వున్నావని నెనెఱుగను. మా ప్రయాణానికి అనుకూలంగావుండే సంగతులు, ఆటుతరువాత మావిధులు గురించి మాలో మేము ఒకరి వుద్దేశాల్ని ఒకరికి వెలిపుచ్చుకొంటూ సంతోషంగావున్న సమయం. అసలు నిన్ను నేనా సమయంలో చూచుటతటస్థించినా మాట్లాడటానికి అవకాశంలేని పరిస్థితులవి.

నీవు నవయువకుడవు. లోకాన్నంతగా తెలుసుకోలేక పోయినా నీవిద్యార్థి దశకు ఫలితంగా యికనైనా తెలిసికోగలగే శక్తిసామర్థ్యాలున్న ధీశాలివి. నీవు తలుచుకున్నట్లయితే ప్రేమగీతికల్ని కాము, కామగీతికల్ని జాతీయ గీతికలుగానూ, నీ ప్రేమానుభవాల్ని లోకానుభవాలుగానూ మార్చగలిగే కవిత్వం నీలోవుంది. నీవప్పుడప్పుడు పత్రికల్లో వ్రాసే విషయాలుచూస్తే నీకున్న వాక్చాతుర్యాన్నికూడ మెచ్చుకుంటూంటాను. నీవంటి యువకులెందరో - కర్షకునిలగాయితూ చక్రవర్తిని సహితం తమ అపూర్వ రచనల్తో ఆవేశపూరితుల్ని చేసి విశ్వభారత సౌభాగ్యానికి ప్రాణాలను సహితం ధారపోయటానికి సిద్ధపడేట్టు చేయజాలే కవికుమారులు, విద్యావంతులై నిరుద్యోగ సమస్యను సాల్వ్ చెయ్యలేపోయినా జనసంఖ్యనుమాత్రం సులువుగా తేల్చగలిగిన మహానుభావులు, కొండలను పిండిచేసే బలసంపన్నులు, యింకా ఎందరో అనేక రకాలవాళ్ళు - ముందంజవేసి భారత జాతీయ తేజాన్ని సానపట్టి సంసిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమయింది.

ఇంతగా వ్రాసేనని మనస్సులో ఈర్ష్యావేశాల్ని రేకెత్తించకు. కేవలం అది నీకుగాదు నవ్యభారతిని కీర్తివంతంగా చేయజాలే దివ్యపథం అని నమ్ము................................"

అనివున్న ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివానో జ్ఞప్తికి రాదుగాని మా సమితి సోదరుడు నన్నుతట్టి "ఏం వోయ్ నాథం! ఉదయం 7 గం॥ ల కందుకున్న ఉత్తరాన్ని మధ్యాహ్నం 12 గం॥ లకైనా ముగించలేక పోయ్యావ్! హాఁ ఏఁ! అంత అమోఘంగావుందా! లే భోజనానికి వేళయ్యింది. ఆలస్యమైతే శకండ్ బాచీ, ఎంగిలి మెతుకులూ "అంటూ లేవనెత్తేవరకూ చదువుతూనేవున్నా, అప్రయత్నంగా నా నోటంట "నిజమే" అన్నముక్కొచ్చేసింది.

## శుభవార్త

"కథాంజలి" 4 వ సంవత్సర జన్మదినసంచిక 5-6-43 తేదీ వెలువడుతుంది. వ్యాసకర్తలు తమతమ వ్యాసాల్ని 10-5-43 తేదీలోపల మా కార్యాలయానికి పంప ప్రార్థన.

కథలుకాని, వ్యాసాలుకాని "కథాంజలి" పుటలలో 1½ అథవా రెండుపుటలకు మించరాదని ప్రత్యేకవినతి చేస్తున్నాము.

—ఎడిటర్.